


దేశంలోని సిగరెట్ పరిశ్రమలాగా బీచ్ కళకళలాడుతోంది. ఆకా
చూస్తే సిగరెట్ కాలుస్తున్నట్టు ఎర్రగా వుంది. విపరీతంగా సిగ
త్రాగేవాడి పెదవుల్లా సముద్రం నల్లగా కనిపిస్తోంది.

బీచ్‌లో అమ్మాయిలు అప్పుడే త్రిబుల్ ఫైవ్ పాకెట్‌లోన




తీసిన సిగరెట్‌లా మెరిసిపోతూ మైమరిపిస్తున్నారు. వారం రోజుల్నుంచీ సిగరెట్ లేక జీవచ్ఛవంలా బ్రతుకుతున్న ఓ బలహీనుడికి మళ్ళీ సిగరెట్ కళ్ళబడితే, కొన్నివేల వాట్ల కాంతితో మెరిసే కళ్ళలా దూరంగా లైట్లు వెలుగుతున్నాయి.

సత్యం జనానికి దూరంగా కూర్చుని సిగరెట్ కాల్చడం మర్చిపోయి, అటూ యిటూ కావలసిన వ్యక్తికోసం ఎదురుచూస్తున్నాడు. నోట్లో సిగరెట్ పెట్టుకున్నాక, జేబులో అగ్గిపెట్టె లేదని గుర్తుకొస్తే ఎంత విసుగ్గా వుంటుందో అంత విసుగ్గా వుంది సత్యానికి.

అయిదు గంటలకే వస్తానన్న లత యింకా రాలేదు. విందు ముగిశాక తాంబూలం (కిళ్ళీ) సిగరెట్టూ ఎంత అవసరమో, ఆ రోజు లతకూడా అంత అవసరం. ఆ రోజున తన జీవితంలో కొత్తమలుపు తిరగవలసివుంది.

* * *

నిజానికి డిగ్రీ చదువులవరకూ సత్యానికి సిగరెట్ అలవాటు లేదు. ఒకసారి ఎవరో ఫ్రెండ్ పార్టీకి పిలిస్తే వెళ్ళాడు. వాళ్ళెంతో బలవంతం చేస్తే ఓ సిగరెట్టు తాగాడు. దగ్గుకూడా వచ్చింది.

అలా ఆనాడు పెదిమలమధ్య బందీ అయిన సిగరెట్ యీనాటికీ అలాగే వుంది. అప్పటికీ యిప్పటికీ ఆరు సంవత్సరాలు తేడా. మనిషి జీవితంలో ఆరేళ్ళంటే మాటలా! వడ్డీవ్యాపారి అయితే బ్యాంక్‌లో తన ఎకౌంట్‌లో ఆరింతలు చేర్చగలిగేవాడు. భార్యని ప్రేమించిన భర్త కనీసం ఆరు ప్రాణాలకు జీవం పోయగలిగేవాడు.

"బాబూ! నీవు ఎందుకు సిగరెట్లు కాలుస్తున్నట్టు? నిన్ను యిందాకటినుంచీ చూస్తున్నాను. గంటలో యాభై సిగరెట్లు కాల్చావు!" అని ఎవరో ముసలాయన ఓనాడు అకస్మాత్తుగా సత్యాన్ని ప్రశ్నించాడు.

సత్యం ఓ నవ్వు నవ్వాడు.

"నిజమే! నే నెందుకు సిగరెట్లు కాలుస్తున్నట్టు?" అని తనలో తను ప్రశ్నించుకున్నట్టుగా ప్రశ్నించుకుని, "సార్! చెట్లు ఎందుకు పూలు పూస్తున్నాయో చెప్పండి. చంద్రుడు ఎందుకు వెన్నెలనిస్తున్నాడో చెప్పండి. అలాగే కొవ్వొత్తి అది కాలిపోతూ మనకి వెలుగు నిస్తుంది - ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయి? వాటికవి సహజలక్షణాలు. అలాగే యీ సత్యానికి సిగరెట్లు తాగటం సహజ లక్షణం" అన్నాడు.

ఆ ముసలాయన ఓపిగ్గా "అది కాదు బాబూ! ఇప్పుడు ఈ క్షణాన ఈ సిగరెట్ ఎందుకు కాలుస్తున్నావో చెప్పు" అన్నాడు.

"క్రితం నిమిషం సిగరెట్ కాల్చలేదు కాబట్టి."

ఆ సమాధానం విని ముసలాయన తికమకపడ్డాడు. సత్యం వెంటనే అందుకుని, "గురువుగారూ! అట్టే యిదిఅయిపోవద్దు. సిగరెట్లు తాగే థియిరీ మీకు తెలిసినట్టు లేదు. సిగరెట్లు మూడు రకాలుగా కాలుస్తారు.

మరీ భరించరాని విచారమేదైనా కలిగినప్పుడు సిగరెట్ మీద సిగరెట్ వెలిగిస్తారు. పరీక్ష పోయినప్పుడో, తాను ప్రేమించిన పార్వతిని ఏ ముసలాయనో ఎగరేసుకుని పోయినప్పుడో కాల్చడం మొదలు పెడతారు. వీళ్ళంతా మొదటి రకంవాళ్ళు. ఇక రెండవ రకంవాళ్ళు భరించరాని ఆనందం కలిగితే సిగరెట్ కాలుస్తారు.

మూడవ రకంవాళ్ళు. వీళ్ళే నిజమైన సిగరెట్ కాల్చేవాళ్ళు. వీళ్ళకి సిగరెట్ కాల్చకపోతే ఏమీ తోచదు. తోచకపోతే సిగరెట్ కాలుస్తారు. నేను మూడో రకం వాణ్ణి."

సెలవులకు యింటికి వెళ్ళిన సత్యంనుచూసి వాళ్ళమ్మ చాలా బాధపడి "యిలా చిక్కిపోయావేరా! నవనవలాడుతుండేవాడివి, సన్నబడిపోయావేమిటి? ఆ వెధవ సిగరెట్ మానకపోతే నేను చచ్చినంత ఒట్టే!" అంది వాళ్ళమ్మగారు. అంత ఘోరమైన ఒట్టు పెట్టుకున్నందుకు సత్యం ఓ రోజంతా సిగరెట్ మానేశాడు కాని, ఆ రోజు గడిచేసరికి చావుతప్పి కన్ను లొట్టపోయినంత పనైంది. ఇక అక్కడ ఉండలేక కాలేజీకి వచ్చేశాడు.

ఓ నాడు కాలేజీకి వెళ్ళివచ్చి నిద్రపోయాడు. నిద్ర లేచేసరి

సాయంత్రం 5 గంటలు అయింది. సిగరెట్ వెలిగించగానే దగ్గువచ్చింది. అంత భయంకరమైన దగ్గు ఎప్పుడూ రాలేదు. పేగులన్నీ ఉంగచుట్టుకుని పోయి. నోట్లోంచి బయటకు వచ్చేటంత భయంకరంగా వచ్చింది. కంగారుగా పరుగెత్తుతూ వెంటనే డాక్టరు దగ్గరికి వెళ్లాడు. డాక్టరు సత్యంని పరీక్షించి పెదవి విరచి "మిస్టర్ సత్యం, నేను నీకు యివ్వగలిగినది ఇదొక్కటే!" అని చీటీ ఒకటి ఇచ్చాడు. అందులో "నో స్మోకింగ్" అని పెద్ద అక్షరాలతో గ్రీన్ యింక్‌లో వ్రాసి వున్నది. దాంతో సిగరెట్లు మానెయ్యాలనే తలంపుకి వచ్చాడు సత్యం.

"ఎలా మానటం?" అని తీవ్రంగా ఆలోచిస్తూ సిగరెట్ తీసి వెలిగించి ఆలోచించసాగాడు. "నేను సిగరెట్లు ఎలా మానాలి? అనే సమస్య గురించి ఆలోచిస్తున్నాను" అని తెలుసుకొనేసరికి అప్పటికే అతని పెదిమల మధ్య కనీసం ముప్పై సిగరెట్లు కాలిపోయాయి.

తనిప్పుడు సిగరెట్లు మానాలి - మానేయాలంటే ఏం చెయ్యాలో ఆలోచించాలి. ఆలోచించాలంటే సిగరెట్లు కాల్చాలి. పెళ్ళి అయితేగాని పిచ్చి కుదరదు; పిచ్చి కుదిరితేగాని పెళ్ళి కాదు.

వీటిని అన్నిటిని తలచుకొనేసరికి సత్యంకి ఏడుపు వచ్చింది. దీనిని పరిష్కరించగల స్నేహితుడు ఒక్కడే వున్నాడు-కృష్ణ.

కృష్ణ తనని ఎన్నో రోజుల్నుండి సిగరెట్లు మానేయమని గొడవ చేస్తున్నాడు. వాడిని వెదుక్కుంటూ వెళ్ళి, డాక్టర్ రాసిచ్చిన చీటీ చూపించాడు. కృష్ణ కంగారుపడి "ఒరేయ్! ఇప్పుడన్నా ఆ వెధవ సిగరెట్ మానెయ్‌రా!" అని చాలా హితబోధ చేశాడు. లాభంలేక ఆఖరికి "అయితే వక్కపొడి అలవాటు చేసుకో! సిగరెట్లన్నా మానెయ్యవచ్చు" సలహా యిచ్చాడు. ఈ సలహా ప్రకారం సత్యంకి ఇప్పుడు కొత్తగా వక్కపొడి అలవాటయింది. ఓ రోజు ఎవరూ చూడకుండా సిగరెట్ వెలిగించాడు. సిగరెట్టూ, వక్కపొడి కాంబినేషన్ చాలా బాగుంది. కృష్ణ - విజయనిర్మలలాగా, రామారావు- సావిత్రిలాగా, శోభన్‌బాబూ - శారదలాగా, నాగేశ్వరావూ-వాణిశ్రీలాగా గొప్ప థ్రిల్లుగా వుంది - సిగరెట్టూ, వక్కపొడి కాంబినేషన్.

ఆ తర్వాత కృష్ణ ఇంకొక సలహా ఇచ్చాడు. సిగరెట్‌కీ, సిగరెట్‌కీ మధ్య కనీసం కొంత వ్యవధైనా యివ్వమని. కాని ఇదికూడా ఫెయిల్ అయింది.

విసుగుచెంది ఈసారి కొత్త పద్ధతి మొదలుపెట్టాడు. "సిగరెట్

మానేశాను" అని కనబడిన వాళ్ళందరికీ చెప్పాడు. 'వాళ్ళకలా చెప్పాక తాగితే ఎలా?' అన్న భావన అన్నా కలుగుతుందని. అందరూ నీ బొంద అని హేళన చేశారు, సత్యంమీద నమ్మకంలేక. సత్యంకి ఒళ్ళుమండి ఇదివరకుకన్నా ఎక్కువ చేశాడు.

ఈ విధంగా కృష్ణ సత్యంచేత చాలా చాలా ప్రయత్నాలు చేయించాడు. ఆఖరికి ఓ ఆలోచన చేశాడు. వాళ్ళ కాలేజీలో ఒక లెక్చరర్ కూడ ఈ విధంగానే తెగ సిగరెట్లు కాల్చేవాడు. కొందరు పెద్దలు కలిసి ఆ లెక్చరర్‌చేత సిగరెట్లు మాన్పించారు. కారణం శాంత అనే అమ్మాయి వలన. వీడికికూడా ఏ గీతనో, సీతనో పరిచయం చేస్తే వాళ్ళవల్లనైనా సిగరెట్లు మానేస్తాడేమో! సత్యానికి తెలియకుండా కృష్ణ తమ మిత్ర బృందాన్నంతా ఒకచోట సమావేశపరిచి విషయాన్ని విశదీకరించి చెప్పాడు.అందరూ కలిసి సత్యానికి ఓ జోడీని కలిపేందుకు నిశ్చయించుకున్నారు.

వాళ్ళ క్లాసులో 'లత' కొంచెం చురుకైన పిల్ల. ఆమె వినేలా సత్యం గురించి తెగ పొగుడుతూ మాట్లాడుకునేవారు. ఓ రోజున సత్యం ఆ దారిన వస్తూండగా, లతమీద ఎవరో యిద్దరు దుండగులు విరుచుకు పడినట్టు, మారు వేషాలేసుకుని విరుచుకుపడ్డారు. సత్యం వారితో తలబడి లతను రక్షించాడు, కృష్ణకో చెల్లెలుంది. ఆమె ద్వారా 'లత' చేతిని ఓ దొంగసాధువుకు చూపేలా చేసి "స" అక్షరంతో ప్రారంభమయే పేరు గల కుర్రాడిని ప్రేమించటం శ్రేయస్కరమన్నట్టు ప్రేరేపణ కలగ జేశారు. చివరకు 'లత' నుండి ఓ నాడు సత్యంకు ప్రేమలేఖ వచ్చింది. ఓ యాభై సిగరెట్లు తగలేసి, సత్యంకూడా ఓ ప్రేమలేఖ తయారుచేసి 'లత'కు పంపించాడు, అలా మొదలయింది వారి ప్రేమ.

అదేపనిగా సిగరెట్లు తాగటం తనకే రోతగా వుంది."లత" కోసమైనా తను సిగరెట్లు మానేయాలని సత్యం నిశ్చయించుకున్నాడు. సిగరెట్టు పెట్టె కొని జేబులో వుంచుకుని కూడా, కాసేపు బయటికి తీయలేదు. లత రాక కోసమని అతడు బీచ్ దగ్గర వెయిట్ చేస్తున్నాడు. అయిదున్నర అయింది. "లత వస్తానన్నది-కరక్టుగా అయిదు గంటలకు, ఒకవేళ ఆ రోజు లత రాదేమో"....సత్యంకు గుండె బరువెక్కింది. సిగరెట్ పెట్టె తీశాడు. అలా ఒక పెట్టెతో ఆగలేదు. ఒక వేళ సిగరెట్ల కంపు మనిషితో స్నేహమేమిటని లత మనస్సు మార్చుకుందా? లత లేకపోతే తనెలా సిగరెట్లు మానటం?

తల వంచుకుని ఆలోచనలతో సతమత మవుతున్న సత్యంకు లత గులాబీ రంగు జరీ చీరె కుచ్చెళ్లు కనిపించాయి. వెంటనే తలెత్తాడు. లత! "అమ్మయ్య" అనుకున్నాడు. ఆమె నవ్వుతుంటే గులాబీలు విర బూసినట్టుంటుంది.

సత్యం రిలీఫ్‌గా నవ్వుకుని, గబగబా జేబులోంచి పాకెట్ తీసి, సిగరెట్టు నోట్లో పెట్టుకున్నాడు. లత సిగరెట్టు లాక్కుంది.

"లతా! లతా!!" బ్రతిమాలాడు సత్యం.

ఆమె చిలిపిగా తల ఆడించి "ఇవ్వను" అంది.

"లతా! ఇది ఆఖరి సిగరెట్టు. ప్లీజ్! నీ మీద ఒట్టు. ఇక నేను సిగరెట్లు తాగను కదా! ఈ ఒక్క సిగరెట్టు యివ్వు."

సత్యం ఒట్టు విని లత నవ్వి, "ఏమిటి! సిగరెట్లు మానేస్తారా?" అంది.

"నిజం లతా!" అన్నాడు సత్యం.

ఆమె సత్యంకు సిగరెట్టు అందిస్తూ, "నా కోసం అంతపని మాత్రం చేయనపసరం లేదు. మీరు తెల్లటి డ్రెస్ వేసుకుని, నోట్లో సిగరెట్ పెట్టుకుని నిలబడివుంటే ఎంత ఠీవిగా వుంటారో తెలుసా? ఆ మాట కొస్తే, మిమ్మల్ని సిగరెట్ల పోజుల్లోనే చూసి నన్ను నేను మరిచి పోయాననుకుంటాను," అంది.

తల తిరిగి క్రింద పడిపోయినంత పనైంది సత్యంకు.

లత అతడికి సన్నిహితంగా జరిగి, ఆప్యాయంగా అతడి కళ్ళలోకి చూస్తూ, లైటర్ వెలిగించింది సత్యం కోసమని. *


విజయ
అనుబంధ మాలిక

మార్చి నెల నవల
'కకుభ' రచన
జ్వాల